సాగుకు అండగా ఆర్బీకేలు !

- సొంతూరులోనే ప్రతి సమాచారం అందుతున్న వైనం
- సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేత
- వ్యవసాయ పరికరాలు అందజేస్తూ చేయూత
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ, ఆరోగ్య, విద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యనిస్తుంది. వ్యవసాయం అంటే జూదంలా మారిందని నిరాశకు లోనైన అన్నదాతకు అండగా నిలుస్తుంది ప్రభుత్వం. పెట్టుబడి సాయంతోపాటు విత్తు నుంచి దిగుమతుల విక్రయం వరకు రైతన్నకు చేయూతనిస్తుంది. రైతుల సౌకర్యార్థం సచివాలయాలకు అనుబంధంగా నెలకొల్పిన రైతుభరోసా కేంద్రాలతో పల్లెలకు కొత్తశోభ సంతరించుకుంది. వ్యవసాయానికి సంబంధించిన సేవలు, ఇతర పూర్తి సమాచారం సొంతూరిలోనే నెలకొల్పిన రైతుభరోసా కేంద్రాల్లో అందుతుండడంతో అన్నదాత సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. గత ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులకు మండల కేంద్రాలకు వెళ్లి నానాకష్టాలు పడేవారు. రాత్రింబవళ్లు నిరీక్షించాల్సిన దుస్థితి. సబ్సిడీ విత్తనాలు అందాలంటే ఓ పోరాటమే. రోజుల తరబడి నిరీక్షించినా ప్రయోజనం చేకూరేది కాదు. అలాంటి పరిస్థితులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వస్తి చెప్పింది. ప్రజల వద్దకే పాలనలో



సంజామల రైతుభరోసా కేంద్రం

- మండలంలో ఆర్బీకేల సంఖ్య -11
  మొత్తం రైతులు -13,825
  రైతు భరోసా పొందిన రైతుల సంఖ్య- 8,477
  మొత్తం లబ్ధి- రూ.11.54 కోట్లు
- వ్యవసాయ పరికరాలు పొందిన రైతులు-90
  యంత్ర పరికరాలతో చేకూరిన మొత్తం లబ్ధి - రూ.90 లక్షలు

భాగంగా రైతుభరోసా కేంద్రాలను నెలకొల్పి రైతుల ముంగిటకే సేవలందిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంటనష్టం వాటిల్లితే ఆర్బీకే సిబ్బంది వెంటనే స్పందిస్తున్నారు. పంట పొలాలను సందర్శించి నష్టం వివరాలను ఉన్నతాధికారులకు సమర్పించి బాధిత రైతులను ఆదుకుంటున్నారు. బ్యాంకు రుణాల విషయంలోనూ సాయపడుతున్నారు. అదే విధంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు ఆర్బీకే సిబ్బంది. ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రయోజనాలపై రైతులను చైతన్న పరుస్తున్నారు. పంట మార్పిడి, భూసార పరీక్షల ప్రయోజనాలను వివరిస్తున్నారు కూడా.

ఆర్బీకేలు రైతులకు ఎంతో ఉపయోగం



రైతుభరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. రైతులకు ఏ సమాచారం కావాలన్నా ఆర్బీకేలో అందుబాటులో ఉంటుంది. వ్యవసాయానికి సంబంధించిన సమాచారంతో పాటు సాగు సూచనలు చేస్తున్నారు సిబ్బంది. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నాం. ఆర్బీకేల సేవలను రైతులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటే వ్యవసాయం గిట్టుబాటుగా ఉంటుంది.

– సుధాకర్ రెడ్డి, వ్యవసాయాధికారి, సంజామల మండలం

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



ప్రభుత్వం ఆర్బీకేలలో అందుబాటులో ఉంచిన ఎరువులు, విత్తనాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందిస్తున్నందున ఖర్చు తగ్గింది. గ్రామాల్లోనే ఆర్బీకేలు ఉండడంతో సమయం, డబ్బు ఆదా అవుతుంది. ప్రత్యేకించి ప్రకృతి వైపరీత్యాలు జరిగి పంట నష్టం వాటిల్లినప్పుడు సిబ్బంది స్పందన తీరు అభినందనీయం.

– పెద్ద రామ సుబ్బారెడ్డి, రైతు,ముడిగేడు,

అధికారుల స్పందన బాగుంది



రైతుభరోసా కేంద్రాల్లో అధికారుల స్పందన బాగుంది. ఏదైనా పనిమీద వెళ్తే సానుకూలంగా మాట్లాడుతున్నారు. వ్యవసాయానికి సంబంధించి అన్ని విధాలుగా సలహాలు ఇస్తున్నారు. నాలుగేళ్లుగా రైతు భరోసా అందుతుంది. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం లభిస్తుంది. రైతుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. – ఉస్సేన్ రెడ్డి రైతు, ఆకుమల్ల

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


వీరాంజనేయస్వామికి సామూహిక పూజ నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా గౌరిపేటలో వెలసిన ఆంజనేయ స్వామి, పలక చింతమాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళహారతి నిర్వహించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

డోన్ టౌన్: మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామ సమీపాన కొండల్లో వెలసిన శ్రీబంగారు కొండ పాతపాలెం అభయ ఆంజనేయస్వామికి ఆదివారం అమావాస్య పురష్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, పంచామృతాభిషేకాలు, తమలపాకుల తోరణాలు,సింధూర కుంకుమార్చనలు, మహా మంగళహారతులు తీర్థ ప్రసాద వితరణలు చేశారు. అనంతరం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్యాపిలి ఎంఈఓగా వెంకటేశ్ నాయక్



ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటేశ్ నాయక్‌కు ప్యాపిలి ఎంఈఓగా పదోన్నతి లభించింది. గతంలో హుసేనాపురం స్కూల్ అసిస్టెంట్‌గా ఉన్న ఈయన పీఆర్‌పల్లి ఉన్నత పాఠశాలకు హెచ్ఎంగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహించిన పదోన్నతుల్లో ఆయన ప్యాపిలి ఎంఈఓగా పదోన్నతి పొందారు. గతంలో ఇక్కడ ఎంఈఓగా పని చేస్తున్న శ్రీనివాసులు నందికొట్కూరుకు బదిలీ అయ్యారు. వెంకటేశ్ నాయక్ సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

ఎంఈఓగా పదోన్నతి

కోవెలకుంట్ల: సంజామల మండలం గిద్దలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటసుబ్బయ్యను కోవెలకుంట్ల ఎంఈఓ-2గా నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి ఇద్దరు మండల విద్యాశాఖ అధికారులను నియమిస్తోంది. ఇందులో భాగంగా అక్కడ హెచ్ఎంగా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్యకు పదోన్నతి కల్పించి ఎంఈఓగా నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో రొట్టె, గుడ్డు పంపిణీ


రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో హోసన్నా వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, రోగులకు ప్రతి ఆదివారం చేపట్టే రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ కొనసాగింది. ఈ కార్యక్రమానికి ఎల్ఐసీ ఏజెంట్ రమణ ఆర్థిక సాయం చేశారని ఆశ్రమ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల గ్రామంలో ఆదివారం బ్లూక్రాస్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ వరుణ్ ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు ఆరోగ్యపరంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు.

వృద్ధులకు అన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: పట్టణానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ కొమ్మిరెడ్డి రమాదేవి, చంద్రశేఖర్ దంపతుల కుమారుడు మంజునాథ్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ఎన్జీవో కాలనీలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే పట్టణంలోని పంచమపేట ఎపీపీ పాఠశాల, బత్తులూరుడు పాడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు విజయలక్ష్మీ, మహేంద్ర, హెచ్ఎంలు ముకుందరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు ఆచరించండి


జడ్జి తంగమణిని సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ప్రపంచంలోనే భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు గరకపాటి నరసింహరావు తనయుడు గరకపాటి గురజాడ తెలిపారు. గీతా యోగాసన సంఘం 40వ వార్షికోత్సవం పురస్కరించుకోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో పెరుగుతున్న సాంకేతిక అభివృద్ధి కారణంగా దైవత్వాన్ని, తెలుగు సంస్కృతిని మరవడం సరైంది కాదన్నారు. తెలుగు సంస్కృతిని గౌరవిస్తున్నట్లు తెలిసేది మీ పిల్లలకు పేర్లతోనే తెలుసుకోవచ్చన్నారు. డోన్ పేరును మరలా ద్రోణాచలంగా మార్చుకుంటే తన తండ్రి గరకపాటి నరసింహారావును ద్రోణాచలంకు తీసుకవచ్చి ప్రవచనాలు చెప్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను గీతా యోగసన సంఘం గురూజీ రాంపుల్లయ్య ఆధ్వర్యంలో కమిటీ అధక్షుడు సప్తశైల తిమ్మయ్య, సభ్యులు శేషఫణి, నాగభూషణంరెడ్డి సత్కరించారు. అదేవిధంగా కారక్రమానికి అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి తంగమణిని సత్కరించారు.

తోటి మనిషిలో దైవత్వం చూడాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న గురూజీ రమేష్

డోన్ టౌన్: హైదరాబాద్‌కు చెందిన యోగారత్న అవార్డు గ్రహీత యోగా గురూజీ రమేష్ ఆరు రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ ఆదివారం ముగిసింది. పట్టణానికి చెందిన గీతా యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య ఆధ్వర్యంలో ఎస్కేపీ హైస్కూల్లో ఈనెల 13వ తేదీ నుంచి శిక్షణ ఇచ్చారు. చివరి రోజు యోగా మహర్షి పతంజలి ఫొటోకు ప్రత్యేక పూజలు నిర్వహిం యోగా ఆవశ్యకత, ప్రాముఖ్యతను రమేష్ వివరించారు. తోటి మనిషిలో దైవత్వం చూసినప్పుడు మానవుల్లో మానసిక ప్రశాంత దొరకుతుందన్నారు. విద్యార్థులకు యోగాసనాలపై తర్ఫీదు ఇచ్చారు. సమాజంలో తల్లిదండ్రులు,గురువులు,పెద్దలను ఏలా గౌరవించాలి అనే విషయాలు విసదీకరిస్తూ మాతృపూజా కార్యక్రమాలు నిర్వహించి పిల్లల చేత తల్లి దండ్రులకు పాద పూజలు చేయించారు.

పెండేకంటి వెంకటసుబ్బయ్య జయంతి


స్థానిక ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: పట్టణంలోని వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో దివంగత కేంద్ర మంత్రి పెండేకంటి వెంకటసుబ్బయ్య 102వ జయంతి కార్యక్రమాన్ని ఆదివారంకళాశాల ఏఓ సురేష్, ప్రిన్సిపాల్ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలోని పెండేకంటి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కేంద్ర మంత్రిగా, బీహార్, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా పెండేకంటి చేసిన సేవలను ఈ సందర్భంగా ఏఓ సురేష్, ప్రిన్సిపాల్ రమణారెడ్డి గుర్తు చేశారు. అలాగే స్థానిక ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ, కళాశాల అధ్యాపకులు మునిరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో గ్రేడ్‌లు ప్రదానం

డోన్ : స్థానిక శ్రీ సుధ విద్యాలయంలో ఆదివారం రాం స్కూల్ ఆఫ్ కరాటే ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఆఫ్ కరాటే డు ఆఫ్ అసోసియేషన్ కర్నూలు వారిచే కరాటే గ్రేడింగ్ నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, చీఫ్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఈ గ్రేడింగ్‌లో లౌక్య, సాకేత్, అశ్వర్థ్, సాయిచరణ్, క్రిష్, మోక్షిత్‌లకు ఎల్లో బెల్ట్, రిషి, నవదీప్, ఇమతేజ్, అభిరాం, వైశాలిలకు ఆరంజ్ బెల్ట్, వర్షిత్, చరణ్‌తేజ, రాగప్రణవి, సాయిధీరజ్, వంశిధీరజ్‌లకు గ్రీన్ బెల్ట్, హేమంత్, రాజసింగ్, శ్రీనిత్య, చరణ్‌దీప్, నిఖిల్‌లకు పర్పుల్ బెల్ట్, శ్రీరామ్, చక్రికలకు బ్లూ బెల్ట్, నిక్షిత్, దేవాన్ష్, స్వాతిరెడ్డి, తన్విరెడ్డిలకు బ్రౌన్ బెల్ట్‌లను కేటాయించినట్లు కరాటే మాస్టర్ రమణ తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఫయాజ్, టీం మేనేజర్ బాబాలు పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణే ధ్యేయం

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే పునరుద్ధరణే ధ్యేయంగా ముందుకు సాగాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులి కొండన్న తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఎంవీఆర్‌పీఎస్ నూతన నియోజకవర్గ, పట్టణ కమిటీల ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జయరాం పాల్గొన్న సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కాశన్నను ఎన్నుకున్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లాలుస్వామి, నాయకులు నాగేశ్వరరావు, మదనగోపాల్, పరమేష్, రఘురాం, సవారీ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : ప్రజా సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పసుపల గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దరాజుపాళెం, పసుపలతాండ, కాలేనాయక్ తాండ, బద్రేనాయక్‌తాండ గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీపీ మానసవీణ, సర్పంచ్ మోహన్ బాబు, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ హేమలతారెడ్డి, ఎంపీటీసీ మహేశ్వరమ్మ తదితర నాయకులు, అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రానివారు తమదృష్టికి తీసుకు రావాలని సూచించారు. అవసరం అనుకుంటే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా సమస్యలు విన్నవించుకోవాలన్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన


లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పేదకు సంక్షేమ పథకాలు అందజేయాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలేకాక ఇవ్వనివీ అమలు చేశారన్నారు. సీసీ రోడ్డు,డ్రైన్స్ ఏర్పాటు చేయాలని పెద్దరాజుపాళెం ప్రజలు ఎమ్మెల్యే కాటసానికి విన్నవించగా పరిష్కార చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. జగనన్న పాలనలో విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి రైతకు ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందజేస్తున్నారని గుర్తు చేశారు. గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేసిన్నట్లు పేర్కొన్నారు. ఆర్‌బీకేల ద్వారా విత్తనాల నుంచి పంట అమ్మకాల వరకు అన్ని సేవలు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, మండల ఏఈ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, హౌసింగ్ ఏఈ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్ నాయక్, పాపన్న, రమేష్‌నాయక్, మద్దిలేటినాయక్, గోవింద్‌నాయక్, రవినాయక్, నాగన్ననాయక్, శంకర్ నాయక్, సోమ్లానాయక్, మనోహర్ నాయక్, బాలునాయక్, రామాంజీ నాయక్, చిత్తు నాయక్, వెంకటనాయక్, కృష్ణ నాయక్, రాముడునాయక్, వెంకటేష్, పి రాముడు, రామకొండయ్య, మధు, పుల్లయ్య, సుబ్బరాయుడు, రోగెన్న, శంకర్, ప్రసాద్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పేండేకల్లు గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య ఆదిలక్ష్మి ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిలక్ష్మిని చికిత్స నిమిత్తం బేతంచెర్ల సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

బేతంచెర్ల: స్థానిక డోన్ రహదారిలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపాన ఆదివారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తాపడి మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన నాగముని, నాగమద్దమ్మ దంపతులు గాయాలకు గురయ్యారు. బేతంచెర్లకు వస్తుండగా ఈ ప్రమాదం జరగడంతో స్థానికులు దంపతులను చికిత్స నిమిత్తం బేతంచెర్ల సీహెచ్‌సీకీ తరలించారు.

వెంగళాంపల్లి యువకుడికి ఎన్టీఆర్ పురస్కారం


ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన కిడాల శివకృష్ణకు ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కారం దక్కింది. ఆదివారం హైదరాబాదులో జరిగిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్, గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా కిడాల శివకృష్ణ ఈ అవార్డును అందుకున్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

బేతంచెర్ల: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా మైనార్టీ అధ్యక్షుడు యూనస్ బాషా, ఉర్దూ అకాడమీ సభ్యుడు మూర్తుజావలీ, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరక్టర్ ఖాజా హుసేన్ తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో 'హర్ దిల్‌మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాథ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం సంక్షేమం పథకాలను ముస్లిం సోదరులకు అందించడమే కాకుండా రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఉప ముఖ్యమంత్రి పదవి, శాసన మండలిలో డిప్యూటీ చైర్ పర్సన్ హోదాలో ముస్లిం మహిళను కూర్చో బెట్టడం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే సాధ్యం అయ్యిందన్నారు. ముస్లిం సోదరుల విజ్ఞప్తి మేరకు నూర్ బాషా కార్పొరేషన్, షేక్ కార్పొరేషన్, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా వైఎస్సార్ పార్టీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలను చట్టసభలకు పంపారన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి దేశంలోనే ఎక్కడా లేనివిధంగా రూ. 21 వేల కోట్లను ఖర్చు చేసిన ఏకైక సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సంధానీ బాషా, ఖాజా, దస్తగిరి, సలీమ్, వలీబాషా, సయ్యద్ మగ్బుల్, అబ్దుల్ గనీ, మహబూ, బాషా, అల్తాప్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సమర్థవంతంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ప్యాపిలి: ప్రభుత్వం ఈ నెల 23 వ తేదీ నుంచి ప్రారంభించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, ఈఓఆర్డీ బాలకృష్ణుడు ఆదేశించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆదివారం సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు తమ పరిధిలోని ఇళ్లకు తిరిగి ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందని వారిని గుర్తించాలన్నారు. అలాగే వివిధ ధృవపత్రాలు పొందలేనివారిని గుర్తించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం కోసం మండల స్థాయి అధికారులు రెండు టీంలుగా ఏర్పడినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ మహబూబ్ బాష, ఆర్ఐ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

బేతంచెర్ల: ప్రజా సమస్యలను సంతృప్తికర స్థాయిలో పసరిష్కరించడం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 24 నుంచి జూలై 27వ తేదీ వరకు చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముందుగానే ప్రజా సమస్యలను గుర్తించి వారితో వలంటీర్ల ద్వారా దరఖాస్తులు చేయించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇప్పటికే సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వార గుర్తించి పథకాలు వర్తింప చేయాన్నారు. గ్రామాల్లో ఎంపీడీఓ, తహసీల్దార్ పర్యవేక్షణలో రెండు బృందాలుగా అధికారులు, కార్యదర్శులు, వలంటీర్లు సమష్టిగా ఇంటింటికి వెళ్లి బర్త్, డెత్, ఇన్‌కమ్, కుల ధ్రువీకరణ సమస్యలు ఉంటే గుర్తించి వెంటనే పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ సత్యదీప్, ఇన్‌చార్జి ఈఓ ఆర్డీ ఈశ్వరన్న పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

డోన్ టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సంకల్పం ముఖ్య ఉద్దేశమని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. జగనన్న సంకల్పం, సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్యాలయంలో ఆదివారం సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక తదితర సమస్యల కారణంగా సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి న్యాయం చేయాలన్నారు. ఈ నెల 23తేదీ నుండి ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించాలని సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులకు సూచించారు.

నేడు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశానికి క్రీడాపోటీలు

సంజామల: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మండల స్థాయి క్రీడా పోటీల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శివ జ్యోతి తెలిపా రు. ఎంఈఓ మాట్లాడుతూ డీఎస్‌డీఓ ఆదేశాల మేర కు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశానికి 4, 5 తరగతుల ప్రవేశం కొరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు సంజామల ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాషాను సంప్రదించాలన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

బేతంచెర్ల: ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండటానికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడమే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ ఏపీ అధికారులు ఉదయ్ కిరణ్, రాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఆర్‌బుక్కాపురం, ఆర్ కొత్తపల్లె గ్రామంలో 6వ విడత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేను వారు తనిఖీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నివేదికను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సంస్థకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ రంగాపురం ఉప కేంద్రం ఏఎన్ఎం రాజేశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, ఆశావర్కర్ వరలక్ష్మీ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి మృతి

సంజామల: మండల కేంద్రం సంజామలో ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌లో కమాటిగా పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి సత్యరాజు (56) మృతి చెందారు. సత్యరాజు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు భార్య జయమ్మ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్‌క్లబ్ 2023–24 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక బాలాజీ కల్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిటీ సభ్యులు డాక్టర్ సహదేవుడు, రవికృష్ణ, ఏవీఆర్‌ప్రసాద్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా పీవీ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా సోమేసుల నాగరాజు, కోశాధికారిగా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. ఉపాధ్యక్షులుగా పోసిన సుబ్బారావు, ఉపేంద్రనాథరెడ్డి, షావలిరెడ్డి, కూరప్రసాద్, ఎలిశెట్టి రత్నాకర్, సీనియర్ సభ్యులను బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌గా వివిధ కార్యక్రమాల కమిటీ చైర్మన్లుగా ఎన్నుకున్నారు.

వ్యక్తిపై దాడి

ఆళ్లగడ్డ: పట్టణంలోని చాగలి పామన్నపై భార్గవ అనే వ్యక్తి కత్తితో దాడిచేశాడు. రామలక్ష్మి కొట్టాలకు చెందిన పామన్న మేదర వీధికి చెందిన భార్గవకు జీవాలు విక్రయించాడు. కొంత మొత్తం బాకీ ఉండటంతో పామన్న ఆదివారం భార్గవ ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా ఇద్దరి మధ్య వాగ్వాదం చేటుచేసుకుంది. దీంతో భార్గవ కత్తితో పామన్నపై దాడి చేయగా స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

ప్రారంభమైన రహదారి పనులు


నాగమళ్ల కుంట గ్రామానికి రహదారి పనులు జరుగుతున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని నాగమళ్ల కుంట గ్రామ రహదారి పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. హిమానుపురం నుంచి నాగమళ్ల కుంట వరకు రహదారి కంకర తేలడంతో రాకపోకలు ఇబ్బందిగా మారాయి. ఈ నేపథ్యంలో మిగిలిపోయిన రహదారి పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులకు రహదారి కష్టాలు తొలగనున్నాయి.